## వరి సాగు తగ్గలేదు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి వ్యవసాయ శాఖ వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): గత వానకాలంతో పోల్చితే ఈ వానకాలంలో వరి సాగు ఉత్పత్తి తగ్గలేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో 'పెరిగిందెక్కడ? తగ్గడే' శీర్షికన ప్రచురితమైన వార్తకు వివరణ ఇచ్చారు. గత వానకాలం సీజన్‌లో 65.92 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 144.85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు పేర్కొన్నారు. ఈ వానకాలంలో తుది అంచనాల ప్రకారం 66.78 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 156.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు వెల్లడించారు. బియ్యం ఉత్పత్తి గతంలో 97.65 లక్షల టన్నులు ఉండగా, ఈ సీజన్‌లో 103.61 లక్షల టన్నులు ఉత్పత్తి అయినట్టు వివరించారు.

## ఫీజు బకాయిలు చెల్లించాలి

- బీసీ నేత ఆర్ కృష్ణయ్య డిమాండ్
- సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

హైదరాబాద్, డిసెంబర్8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం వెంటనే స్పందిం చి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేకుంటే 10వ తేదీన కలెక్టర్లు, ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసి మీడియాకు విడుదలచేశారు. బకాయిలు చెల్లించాలని రాష్ట్రంలోని 1800 కాలేజీలు బంద్ చేపట్టాయని, అయినా సర్కారు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదని మండిపడ్డారు. అనేక స్కీములు, కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం వద్ద.. విద్యార్థుల మెస్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించేందుకు బడ్జెట్ లేదా? అని ప్రశ్నించారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 16.75 లక్షల మంది విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ల ముట్టడిలో విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# వ్యక్తి ప్రాధాన్యంగా విజయోత్సవాలా!

- పార్టీ పాలసీ ఒకటైతే మీరు చేస్తున్నదేమిటి?
- ముఖ్యనేతను నిలదీసిన సీనియర్ మంత్రి
- పునరంకిత సభల స్థానంలో స్వోత్కర్ష సభలా అంటూ మండిపాటు
- ఇవి వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకునే సభలని అసంతృప్తి
- ప్రగతి నివేదికలపై సీనియర్ మంత్రుల సహాయ నిరాకరణ
- వ్యవసాయ శాఖ నుంచి వెల్లడి కాని ప్రగతి నివేదిక



హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పుడు పునరంకిత సభలు పెటుకోవడం కాంగ్రెస్ పార్టీ ఆనవాయితీ అని, కానీ రాష్ట్రంలో విజయోత్సవ సభల పేరుతో వ్యక్తిగత గొప్పలు, స్వోత్కర్ష వేదికలుగా మారుస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ మంత్రి ఒకరు ముఖ్యనేతకు ఎదురు తిరిగినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఇది పార్టీ పాలసీకి విరుద్ధమని తెగేసి చెప్పినట్టు సమాచారం. కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో పునరంకిత సభలు పెట్టారని.. ఆ సంస్కృతిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొనసాగించారని ఆయన గుర్తు చేసినట్టు అత్యంత విశ్వసనీయ వ్యక్తుల ద్వారా తెలసింది. ఈ మేరకు ఇటీవల ఓ జిల్లాలో జరిగిన బహిరంగ సభ అనంతరం సీనియర్ మంత్రి తన అసంతృప్తి వెళ్లగక్కినట్టు తెలిసింది. పాలనా వైఫల్యాలపై ఆత్మ విమర్శ చేసుకుంటూ.. సాధించిన విజయాలను ప్రజలకు చెప్పుకుంటూ, ఇందిరమ్మ స్ఫూర్తితో మరింత మెరుగైన పాలనకు దిశానిర్దేశం చేసుకోవటం కోసం పునరంకిత సభలు జరుగుతాయని సదరు మంత్రి గుర్తు చేసినట్టు తెలిసింది. ఆ దిశగా ఇప్పటి వరకు ఒక్క సభ కూడా జరుగలేదని, కేవలం వ్యక్తి ప్రాధాన్య సభలు మాత్రమే జరుగుతున్నాయని, దేవుండ్ల మీద ఒట్లు, కేసీఆర్‌కు తిట్లు అన్నట్టు తప్ప కాంగ్రెస్ పార్టీని, భవిష్యత్తు పరిపాలనను పరిపుష్టి చేసుకునే విధంగా ఒక్క సభ కూడా సాగలేదని ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీ నేతగా తాను ఇటువంటి సభలను సమర్థించలేనని తెగేసి చెప్పినట్టు తెలిసింది.

### తప్పుడు సమాచారంతో ప్రజల్లోకి వెళ్లలేం

ఏడాది పాలన ప్రగతి నివేదికలు రూపొందించటంపై కూడా సీనియర్ మంత్రులు తమ సహాయ నిరాకరణ తెలియ చేసినట్టుగా తెలుస్తోంది. ఏడాది పాలనలో ఏమి అభివృద్ధి సాధించామని ప్రగతి నివేదికలు తయారు చేయాలని, తప్పుడు సమాచారంతో కూడిన ప్రోగ్రెస్ రిపోర్టులను తీసుకొని ప్రజల్లోకి వెళ్లి అభాసుపాలు కాలేమని ఐదుగురు సీనియర్ మంత్రులు తెగేసి చెప్పినట్టు నిర్దిష్టంగా తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయశాఖ నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదిక బహిర్గతం కాకపోవటంతో ముఖ్యనేత, సీనియర్ మంత్రుల మధ్య సంవాదం జరిగిందనే వాదనకు బలాన్నిస్తోంది. ఈ మేరకు ఏడాది పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేసిన ఖర్చు తదితర సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టు తయారు చేయాలని సూచలిచ్చినట్టు సమాచారం. విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చే విధంగా ప్రోగ్రెస్ రిపోర్టు ఉండాలని ముఖ్య నేత దిశానిర్దేశం చేసినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తున్న వ్యవసాయం, సివిల్ సప్లై, నీటి పారుదల, రోడ్లు భవనాల శాఖలకు చెందిన మంత్రులు ప్రగతి నివేదికలు ఇవ్వటానికి ఇప్పటి వరకు ముందకు రాలేదు. రూ 2 లక్షల రుణ మాఫీ పూర్తి అయిందని ప్రభుత్వం ప్రకటించగా.. తమకు రుణమాఫీ కాలేదంటు వేల కొద్ది రైతు కుటంబాలు రోడ్డెక్కుతున్నాయి. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు రూ.12,000, రైతు భరోసా మీద ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన చేయలేకపోతున్న నేపథ్యంలో ప్రగతి నివేదికలు ఎలా ఇవ్వాలని సదరు శాఖ మంత్రి ముఖ్యనేత వద్ద తన నిస్సహాయతను వ్యక్తం చేసినట్టు తెలిసింది.

### ఉడికిపోతున్న ఉత్తమ్

నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల నుంచి ఇప్పటి వరకు ప్రగతి నివేదికలు బహిర్గతం చేయలేదు. ఈ రెండు శాఖలకు ఒకే సీనియర్ మంత్రి ఉండటం గమనార్హం. సదరు మంత్రికి, ముఖ్య నేతకు మధ్య అసలు పొసగటం లేదని గాంధీభవన్ వర్గాలే చెప్తున్నాయి. ముఖ్య నేత కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలను ఆయన పెడ చెవిన పెడతారని, తన శాఖలో వేరొకరు వేలు పెట్టడానికి ఇష్టపడరనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాది పాలనలో నీటిపారుదల రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందనే అభిప్రాయంతో సదరు మంత్రి ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయటం కానీ, పురోగతిలో ఉన్న ప్రాజెక్టుకు నిధులు కేటాయించటం కానీ చేయలేదని, కేవలం లగచర్ల పారిశ్రామిక కారిడార్‌ను దృష్టిలో పెట్టుకొని మొదలు పెట్టిన కొడంగల్ లిఫ్ట్ పనులకు మాత్రమే నిధులు ఇవ్వటంతో సదరు శాఖ మంత్రి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి విచారణకు ఆదేశించటం మినహా.. కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేయటానికి నిధులు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో తాను ఎటువంటి ప్రగతి నివేదికలు పట్టుకొని ప్రజల ముందుకు వెళ్లాలని సదరు మంత్రి ప్రశ్నించినట్టు తెలిసింది. రోడ్లు భవనాల శాఖ నుంచి కూడా ఏడాది పాలన మీద ఇప్పటి వరకు ప్రోగ్రెస్ రిపోర్టు వెల్లడి కాలేదు. ఆ శాఖలో కొత్తగా వేసిన రోడ్లు ఏమీ లేకపోవటం, కనీసం పాత రోడ్లను రిపేర్ చేయడానికి నిధులు కేటాయించక పోవటంతో సదరు మంత్రి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు ఉంచకుండా ముఖం చాటేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## మళ్లీ వీఆర్వో వ్యవస్థ

- పాత వీఆర్వోలు, వీఆర్ఏల సర్దుబాటు
- గ్రామ రెవెన్యూ అధికారులుగా పునరుద్ధరణ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): మళ్లీ వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గతంలో వివిధ శాఖల్లోకి సర్దుబాటైన వీఆర్వోలు, వీఆర్ఏల్లో ఎంపికచేసిన వారిని మళ్లీ 10,954 రెవెన్యూ గ్రామాల్లో నియమిస్తామని చెప్పారు. మరో వెయ్యి మందిని సర్వే సెటిల్‌మెంట్ విభాగంలోకి తీసుకుంటామని తెలిపారు. సచివాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నూతన ఆర్వోఆర్ చట్టాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడతామని ప్రకటించారు. 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న మంచి అంశాలను నూతన చట్టంలో పొందుపరిచామని తెలిపారు. ఏడాది కాలంలో ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన అనేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఎన్ని రోజులు సభ నిర్వహించాలో సోమవారం జరుగనున్న బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా నూతన ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నారు. కొత్తగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అందరి దృష్టి ఈ బిల్లుపైనే ఉన్నది. దీంతోపాటు తెలంగాణ వైద్యవిధాన పరిషత్తును ప్రభుత్వంలో విలీనం చేసి సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా మార్చే బిల్లును సైతం ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. సమావేశాల ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖతో అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని సూచించారు. కౌన్సిల్ చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రొటోకాల్ విషయంలో వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభ సజావుగా సాగేందుకు సహకరిస్తామని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, సీఎస్ శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, డీజీపీ జితేందర్, ఏడీజీ మహేశ్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

### తొలిరోజు చర్చకు వచ్చే అంశాలు

1) జీతాలు, పింఛన్ల చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్ 2024
2) తెలంగాణ పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్ 2024
3) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్ 2024
4) తెలంగాణ వస్తువుల, సేవల పన్ను (సవరణ) ఆర్డినెన్స్ 2024
5) 2022-23 సంవత్సరానికి గాను తెలంగాణ విద్యుత్తు ఆర్థిక సంస్థ లిమిటెడ్ 9వ వార్షిక నివేదిక
6) 2021-22 సంవత్సరానికిగాను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ 7వ వార్షిక నివేదిక
7) తెలంగాణ పంచాయతీరాజ్ (సవరణ) అర్డినెన్స్ 2024

# ఈ కుటుంబానికి దిక్కెవరు..?

- పక్షవాతంతో మంచంపట్టిన తండ్రి
- అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి
- జ్వరంతో ఎదిగివచ్చిన కొడుకు మృతి
- అనాథలైన భార్య, కొడుకు
- కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకోలు



అనారోగ్యంతో మృతిచెందిన మిట్ట కుమార్ (ఫైల్)

రామడుగు, డిసెంబర్ 8: అది రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. ఇంటి బాధ్యతలు తీసుకున్న యువకుడు రోజూ కూలీకి వెళ్తేగానీ పూ ట గడువని దుస్థితి. ఓ వైపు పక్షవాతంతో మంచంపట్టిన తండ్రి, అనారోగ్యంతో ఉన్న తల్లి ఆలనా పాలనా చూసుకోవడమే కాదు తన భార్య, కొడు కు కోసం దినదినం కష్టపడుతున్నాడు. బతుకుపోరాటం చేస్తూ ఉన్నంతలో పోషించుకుంటున్నాడు. కానీ విధి వక్రీకరించింది. ఆ ఇంటికి ఆధారమైన అతన్ని అనారోగ్యం రూపంలో బలితీసుకోగా, రామడుగు మండలం వెంకట్రావుపల్లిలో విషా దం అలుముకున్నది. వివరాల్లోకి వెళితే.. వెంకట్రావుపల్లికి చెందిన మిట్ట కుమార్(32)కు తండ్రి లక్ష్మయ్య, తల్లి అంజమ్మతో పాటు భార్య పూజ, ఏడాదిన్నర కొడుకు ఉన్నారు. తండ్రి లక్ష్మయ్య పక్షవాతంతో మంచానికే పరిమితం కాగా, తల్లి అంజమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నది. ఆర్థికంగా లేని కుమార్ ప్రతిరోజూ కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమార్ విష జ్వరం బారిన పడి నాలుగు రోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఎవరి వద్ద అప్పు అడగలేక, దవాఖానకు వెళ్లే స్థో మత లేక స్థానికంగా ఆర్ఎంపీలతో వైద్యం చేయించుకున్నాడు. కానీ నయం కాలేదు. పరిస్థితి విషమించింది. శనివారం రాత్రి స్థానిక యువకులు కుమార్‌ను 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా ఫిట్స్ వచ్చి మార్గం మధ్యలోనే మృతిచెందాడు. కుమార్ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించగా, కొడు కు మృతితో తనపై ఆధారపడిన లక్ష్మయ్య, అంజమ్మతో పాటు భార్య, కొడుకు దిక్కులేని వారయ్యారు. పేద కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని స్థానిక యువకులు వేడుకుంటున్నారు. సాయం చేసేవారు 9849262491 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే చేయాలని కోరుతున్నారు.

## నానమ్మకు పక్షికి పెట్టేందుకు వెళ్లి మనుమడు మృతి

- స్నానాలు చేస్తుండగా మోటర్‌కు విద్యుత్ సరఫరా
- కొడుకు, తమ్ముడిని కాపాడేందుకు వెళ్లి దుర్మరణం
- కిషన్‌రావుపేటలో విషాదం

వెల్గటూర్, డిసెంబర్ 8: నానమ్మకు పక్షికి పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించి స్నానం చేస్తుండగా, విద్యుత్ షాక్ తగిలి మనుమడు మృతిచెందిన ఘటన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌రావుపేటలో రెండ్రోజుల కింద పిట్టల భీమక్క (80) అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మూడో రోజు గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద పక్షికి పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్మశాన వాటికలో స్నానం చేసేందుకు నీటి సౌకర్యం లేకపోవడంతో పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్దకు కుటుంబ సభ్యులు, బంధువులు వెళ్లారు. ఈ క్రమంలో మోటర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో తన సోదరుడైన మల్లేశ్, కొడుకు రిషికి షాక్ కొట్టగా, వారిని తప్పించేందుకు మొగిలి (35) వెళ్లాడు. షాక్ కొట్టి అక్కడే కుప్పకూలి పోయారు. అక్కడే ఉన్నవారు మొగిళికి సీపీపీ చేసి అంబులెన్సులో కరీంనగర్ దవాఖానకు తరలించగా, మార్గం మధ్యలో మృతి చెందాడు. కాగా, రిషికి తీవ్ర గాయాలై ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. మొగిలికి భార్య సుమలత ఉన్నారు. నిరుపేదలైన మొగిలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి సాయం

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 8: కొండపల్కల గ్రామానికి చెందిన బొంగోని సదానందంగౌడ్ గత నెల 29న మృతి చెందాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబాన్ని పూర్వ విద్యార్థులు ఆదివారం పరామర్శించి, రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ గోపగోని నవీన్‌గౌడ్, కౌశిక్, గడ్డం చంద్రమౌళి, వెంకట్ ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కొత్తపల్లి, డిసెంబర్ 8: కొత్తపల్లి పట్టణానికి చెందిన వాసాల జనార్దన్ అనారోగ్యంతో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందాడు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ సహకారంతో మంజూరైన రూ.29,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు ఎస్‌కె బాబా జనార్దన్‌కు అందించాడు.

## రివర్స్ మార్టిగేజ్ సీనియర్ సిటీజన్లకు వరం

జగిత్యాల, డిసెంబర్ 8: సీనియర్ సిటీజన్లకు పోషణ, ఆర్థికావసరాల కోసం రివర్స్ మార్టిగేజ్ వరం లాంటిదని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అసోసియేషన్ కౌన్సెలింగ్ సమావేశ మందిరంలో ఆదివారం రివర్స్ మార్టిగేజ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, వయో వృద్ధుల పోషణ రక్షణ సంక్షేమ చట్టం 2007 నియమావళి 2011 మేరకు తల్లిదండ్రులను పట్టించుకోకుండా, వారిని సంరక్షించకుండా ఉంటున్న పిల్లలపై వృద్ధ తల్లిదండ్రులు సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారి అయిన ట్రిబ్యునల్ అధికారికి ఫిర్యాదు చేస్తే ఆ తల్లిదండ్రుల పేరిట పట్టా ఉన్న ఆస్తిని, బ్యాంకులో రివర్స్ మార్టిగేజ్ చేయించి ప్రయోజనాలు పొందేలా చేస్తారన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు పీసీ హన్మంత రెడ్డి, సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్, కోశాధికారి వేల్ముల ప్రకాశ్ రావు, నాయకులు సింగం భాస్కర్, యాకూబ్ హుస్సేన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుంత తవ్వారు.. వదిలేశారు

- నల్ల పైపు పగలడంతో తవ్విన సిబ్బంది
- వదిలేయడంతో కలుషితమవుతున్న తాగునీరు



తవ్వి వదిలేసిన గుంతను చూపిస్తున్న గ్రామస్తుడు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 8: చెర్లభూత్కూర్‌లోని కుమ్మవాడ వద్ద గ్రామ పంచాయతీ నల్ల పైపు పగిలిపోయింది. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు గుంతను తవ్వారు. పది రోజుల నుంచి మరమ్మతులు చేయడం లేదని.. గుంతను పూడ్చడం లేదని.. ఇటీవల కురుస్తున్న వర్షంతో గుంతలో నీరు నిలిచి తాగునీరు కలుషితం అవుతున్నదని గ్రామస్తుడు సుక్క శ్రీను వాపోయారు. ఈ విషయం జీపీ ఇన్‌చార్జి కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## కేసీఆర్‌ను కలిసిన పాడి కౌశిక్‌రెడ్డి

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను ఆదివారం ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఎమ్మార్పీఎస్ నాయకులకు సన్మానం

తిమ్మాపూర్, డిసెంబర్8: ఎమ్మార్పీఎస్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి ఆదివారం రామకృష్ణకాలనీలోని ఆయన నివాసంలో సత్కరించారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అలువాల సంపత్, కమిటీ సభ్యులను సన్మానించారు. మాదిగ వర్గీకరణ కోసం తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఇక్కడ అలువాల అనిల్, దావు అనిల్, రమే శ్, శ్రీనివాస్, సాయి, వంశీ, అజయ్, సంపత్ ఉన్నారు.



కురిక్యాలలో అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖాన భవనం

## పల్లె దవాఖాన పూర్తయ్యేదెన్నడో..?

గంగాధర, డిసెంబర్ 4: సర్కారు వైద్యాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువ చేయడానికి గత కేసీఆర్ ప్రభుత్వం పల్లె దవాఖానలు ఏర్పాటు చేసింది. గంగాధర మండలం కురిక్యాలలో పల్లె దవాఖాన సొంత భవన నిర్మాణం కోసం రూ.21 లక్షలు మంజూరు చేసి పనులను ప్రారంభించింది. స్లాబ్ వరకు పనులు కూడా పూర్తయ్యాయి. ఇంతలో ప్రభుత్వం మారడంతో పల్లె దవాఖానల పనులు నిలిచిపోయాయి. బిల్లులు రాకపోకవడంతో కాంట్రాక్టర్ పనులు చేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగున్న పల్లె దవాఖానను ఇంటి యజమాని ఖాళీ చేయమంటున్నాడని, అధికారులు స్పందించి పల్లె దవాఖాన పనులను వెంటనే పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు,

## కారు ఢీకొని యువకుడి మృతి

రాంనగర్ డిసెంబర్ 8: నగర శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద కారు ఢీకొని యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన షేక్ వాజిద్ (18) కరీంనగర్‌లో ఉంటూ టైర్ పంచర్ షాప్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం దుకాణం మూసివేసి ఇంటికి వెళ్తుండగా, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. వాజిద్ తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వాజిద్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

## గుండెపోటుతో ఎంపీడీవో మృతి



శ్రీనివాస్(ఫైల్)

ధర్మపురి, డిసెంబర్ 8: బుగ్గారం ఎంపీడీవో మాడిశెట్టి శ్రీనివాస్(60) శనివారం రాత్రి కరీంనగర్‌లోని నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. గత ఫిబ్రవరిలో జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీనివాస్ బుగ్గారం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. విధి నిర్వహణలో భాగంగా శనివారం సాయంత్రం వరకు మండల సిబ్బందితో ఉన్నారు. ఆయన మృతి పట్ల తోటి అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యకం చేశారు.








